## 163. స్వర్గంలో కాకి

గణేష్‌పురిలోని సద్గురు నిత్యానంద బాబా దగ్గరకి కొందరు ప్రజలు ఆయన దర్శనార్థం ఓ శివరాత్రికి వచ్చారు.

వారిలోని ఒకతను బాబాతో రహస్యంగా చెప్పాడు.

"బాబా. ఇక్కడికి మమ్మల్నందరినీ తీసుకువచ్చినతను తాగుతాడు. చేపలు తింటాడు."

"అయితే ఏమిటి? మర్నాటి కల్లా అతను మల మూత్రాల ద్వారా వాటన్నిటినీ బయటకి పంపించేస్తూంటాడు. ఇక తర్వాత అవి అతని దగ్గర వుండవు. నువ్వు మాత్రం ఎందుకు వాటిని అంటిపెట్టుకుని వుంటావు?" ప్రశ్నించారు బాబా.

స్వర్గానికి వెళ్ళినా కాకి మలాన్ని తినడానికే ఎలా ప్రయత్నిస్తుందో అలా కొందరు ఎంతో మంచివాళ్ళ గురించి కూడా చెడు మాటలు చెప్పి సంతోషిస్తూంటారు. వారు స్వయంకృషితోనే అందులోంచి బయటపడాల్సిన అవసరం వుంది.

## 164. అయిందా? లేదా?

ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారిలో చాలామందిలో కలిగే నమ్మకం, తమకి ఆత్మ సాక్షాత్కారం కలగడం జరిగిపోయిందన్నది. ఆశాపూరితమైన ఆలోచనల వల్ల కొందరు ఇలాంటి భ్రాంతికి లోనవుతూంటారు. అలాంటివారిలో ఒకరు తన గురువు దగ్గర దీక్ష తీసుకున్నాక కొంత కాలం ఒంటరిగా ధ్యానం చేసాడు. తర్వాత వెళ్ళి తన గురువుని కలుసుకుని చెప్పాడు.

"స్వామీ! నాకు ఆత్మ సాక్షాత్కారం అయింది."

అతన్ని తేరిపార చూసి చెప్పాడు గురువు.

"ఇంకా అవలేదు."

"అయిందనుకుంటున్నాను స్వామీ. ధ్యాన సమయంలో నాకు వెయ్యి సూర్యుల కాంతి జ్యోతి రూపంలో ప్రజ్వరిల్లుతూ కనుబొమల మధ్య కనబడుతోంది. ఆ సమయంలో పరమ ఆనందం, శాంతి కూడా కలుగుతున్నాయి."

"పిచ్చివాడా! ఎవరికి వారికి మల విసర్జన అయాక పూర్తిగా అయిందో లేదో ఇతరులని అడగకుండా అది ఎలా తెలిసిపోతుందో, అలాగే ఆత్మసాక్షాత్కారం అయాక 'నాకది అయింది' అని ఎవరికి వారికి ఇతరులని అడగకుండానే తెలిసిపోతుంది. ఆత్మ సాక్షాత్కారం పొందాక ఆ విషయంలో ఇంక ఎలాంటి ప్రశ్నలూ, సమాధానాలు ఉదయించవు. అదే దానికి గుర్తు." వివరించాడు గురువు.

## 165. విలువైన నగలు

ఓ కృష్ణ భక్తురాలింట్లోకి ఓ దొంగ రహస్యంగా ప్రవేశించి ఆవిడ నగలు దొంగతనం చేసాడు. ఇంతలో దొంగతనం గురించి ఆ ఇంటి వాళ్ళకి తెలిసి హడావిడి చేసారు. దాంతో పారిపోయేందుకు వీలుకాక ఆ దొంగ వారింట్లోని ఆశోక చెట్టు కొమ్మల్లో దాక్కున్నాడు.

"పోతే పోయాయి ఆ చవక నగలు. ఇవే కృష్ణుడి నగలైతే నేను బాధ పడేదాన్ని, ఎందుకంటే ఈ ప్రపంచంలో కృష్ణుడి నగలని మించి ఖరీదైనవి ఎక్కడ ఉంటాయి?" ఆ భక్తురాలు గట్టిగా చెప్పింది.

ఆ మాటలు విన్న ఆ దొంగకి కృష్ణుడి నగల మీద ఆశ పుట్టింది. అవి దొంగిలిస్తే ఇక జీవితాంతం దొంగతనం చేయకుండా సుఖంగా జీవించవచ్చన్న కోరికతో అతను వాకబు చేస్తే కృష్ణుడు బృందావనంలో ఉండేవాడని తెలిసింది. అతను బృందావనం చేరుకున్నాడు. సదా కృష్ణుడ్ని భజన చేసే అక్కడి భక్తుల నించి వెలువడే భక్తి తరంగాల వల్ల, పైగా కృష్ణుడు